క్లుప్తంగా

ప్రజా భాగస్వామ్యంతోనే పరిసరాల పరిశుభ్రత

పాతపాడు(విజయవాడరూరల్): గ్రామం పరిశుభ్రంగా ఉండటానికి గ్రామస్తులు భాగస్వాములు కావాలని గ్రామ సర్పంచి దేవగిరి సుజాత ఓంకార్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. జగనన్న స్వచ్ఛ సంకల్పం కార్యక్రమంలో భాగంగా గురువారం సర్పంచి సచివాలయం సిబ్బందితో ఇంటింటికి వెళ్లి తడి చెత్త, పొడి చెత్త చెత్త బుట్టలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామంలోని అన్ని కుటుంబాలకు చెత్త బుట్టలను పంపిణీ చేస్తామన్నారు. ప్రతి ఇంటికి గ్రామ పంచాయతీ చెత్తను సేకరించే బండిని పంపుతుందని, దానిలో చెత్తను వేయాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రూరల్ మండల పార్టీ కన్వీనర్ దేవగిరి ఓంకార్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి ఎస్.చెన్నకేశవరావు, సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లు, శానిటేషన్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

అనాథ పిల్లలకు అన్నదానం



పెనమలూరు: పోరంకిలోని వల్లూరుపల్లి నవరత్నమ్మ ట్రస్టులో ఉన్న అనాథ పిల్లలకు గురువారం దాత అన్నదానం చేశారు. బక్రీద్ పండుగ సందర్భంగా పెదపులిపాకలో వ్యవసాయ శాఖలో పని చేస్తున్న ఎండీ షరీఫ్‌అహ్మద్ అనాథ పిల్లలకు తన వంతు సాయంగా అన్నదానం అందించారు. ఆయన మట్లాడుతూ ఇక నుంచి నెలలో మొదటి సోమవారం అనాథ పిల్లలకు పౌష్టికాహారం పంపిణీ చేస్తానన్నారు. అలాగే చదువుకుంటున్న విద్యార్థులకు ఆర్థిక సాయం అందిస్తానని చెప్పారు.

వైఎస్సార్‌సీపీ నాయకుల ఆర్థిక సహాయం



గన్నవరంరూరల్: అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్న కుటుంబానికి వైఎస్సార్‌సీపీ నాయకులు అండగా నిలిచి రూ.22 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. మండలంలోని సూరంపల్లి గ్రామానికి చెందిన అనగాని బుజ్జి కిడ్నీ సంబంధిత అనారోగ్యంతో చికిత్స పొందుతున్నారు. ఆ విషయం తెలిసిన వైఎస్సార్‌సీపీ నాయకులు ఆ కుటుంబానికి గురువారం తమ వంతుగా సహాయం అందించారు. సహకార బ్యాంకు అధ్యక్షుడు తుల్లిమిల్లి ఏడుకొండలు, సర్పంచ్ పులపాక బాబూరావు, ఎంపీటీసీ సభ్యుడు కొండా సీతారామయ్య, మండల వ్యవసాయ సలహా మండలి డైరెక్టర్ పామర్తి మాధవ, సచివాలయం కార్యదర్శి శ్రీనివాస్ కార్యక్రమంలో పాల్గొన్నారు.

పేరంటాలమ్మ సేవలో..



రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం రామవరప్పాడులోని శ్రీ వెంకమ్మ పేరంటాలమ్మను గురువారం దేవదాయశాఖ అదనపు కమిషనర్ కె.రామచంద్రమోహన్ కుటుంబ సమేతంగా దర్శించకున్నారు. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వహణాధికారి పి. లోకేశ్వరి వీరిని ఆలయ మర్యాదలతో ఆహ్వానించారు. అనంతరం అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందుకున్నారు. ఆషాఢ మాసం పురస్కరించుకుని అమ్మవార్లకు గ్రామస్తులు సారె సమర్పించారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో మహిళా భక్తులు పాల్గొన్నారు.

తిప్పనగుంట సొసైటీకి ప్రత్యేక పురస్కారం



హనుమాన్‌జంక్షన్‌రూరల్: రుణాల వసూళ్లలో నూరుశాతం పురోగతి సాధించటంతో తిప్పనగుంట ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం(పీఏసీఎస్) ప్రత్యేక పురస్కారాన్ని సొంతం చేసుకున్నట్లు చైర్మన్ మూల్పూరు ప్రభుకాంత్ గురువారం తెలిపారు. కేడీసీసీ బ్యాంకు చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు చేతుల మీదుగా ఈ పురస్కారాన్ని అందుకున్నట్లు చెప్పారు. 2022-23 వ సంవత్సరానికి గానూ స్వల్ప, దీర్ఘకాలిక రుణాలు కలిపి రూ.6.2 కోట్లు మంజూరు చేయగా, ఆ రుణ మొత్తాన్ని పూర్తిగా వసూలు చేసినట్లు తెలిపారు. దీనికి గానూ కేడీసీసీబీ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు ప్రత్యేకంగా అభినందించి పురస్కారాన్ని అందజేశారని చెప్పారు. అంతేకాక పీఏసీఎస్ ద్వారా రైతులకు ఉచితంగా మంచినీటి ట్యాంకర్‌ను సరఫరా చేస్తున్నట్లు ప్రభుకాంత్ తెలిపారు.

భక్తిశ్రద్ధలతో బక్రీద్

పెనమలూరు: బక్రీద్ పండుగ మండల పరిధిలో గురువారం అత్యంత భక్తిశ్రద్ధలతో చేశారు. యనమలకుదురు గ్రామం ఈద్గాలో జన్నతుల్ బఖీ ఖబరస్తాన్, ఈద్గా అడ్‌హక్ కమిటీ ఆధ్వర్యంలో బక్రీద్ నమాజ్‌కు ఏర్పాట్లు చేశారు. గ్రామంలోని ఆరు మసీదుల నుంచి భక్తులు వచ్చి నమాజ్ చేశారు. ఈ సందర్భంగా మత పెద్దలు సందేశం ఇస్తూ మానవులంతా కులమతాలకు అతీతంగా మెలగాలని, ముస్లింల మధ్య ఐక్యత, సోదర భావం పెంపొందించుకోవాలని సూచించారు. దాదాపు ఐదు వేల మంది ముస్లింలు నమాజ్‌లో పాల్గొన్నారు. అలాగే సనత్‌నగర్‌లోని ఈద్గాలో ప్రత్యేక ప్రార్థలనలు చేశారు. ముస్లింలు ఒకరికొకరు ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. గంగూరులోని మసీదులో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మత పెద్దలు భక్తులను ఉద్దేశించి సందేశం ఇచ్చారు.

ఉయ్యూరులో ప్రత్యేక ప్రార్థనలు..

ఉయ్యూరు: బక్రీద్ సందర్భంగా ఉయ్యూరు పట్టణంలోని పెద్ద మసీదు, చిన్న మసీదు, సాయి మహల్ సెంటర్‌లోని మసీదు, షాదీఖానా మసీదుల్లో ముస్లింలు గురువారం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఈద్గా మైదానానికి వెళ్లి అల్లాహ్‌ను స్మరిస్తూ ప్రార్థించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ అర్షతున్నీసాబేగం, కో ఆప్షన్ సభ్యుడు షేక్ ఖలీల్, షాదీఖానా కమిటీ చైర్మన్ అహ్మద్ ఖాన్, వైఎస్సార్‌సీపీ ఉయ్యూరు ప్రధాన కార్యదర్శి అబ్దుల్ సద్దాం, ఏఎంసీ మాజీ చైర్మన్ షేక్ అబు కలాం, మైనార్టీ విభాగం అధ్యక్షుడు సలీం బేగ్, కౌన్సిలర్ ఎంఏ బేగ్ ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొని పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి, మున్సిపల్ చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ (నాని) ముస్లింలకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. మండలంలోని పెద ఓగిరాల గ్రామంలో బక్రీద్ పండుగను ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు

గ్రామాల్లో బక్రీద్ పండుగ ప్రార్థనలు

నున్న(విజయవాడరూరల్): బక్రీద్ పండుగ సందర్భంగా గురువారం నున్న, పి.నైనవరం గ్రామాల్లోని



యనమలకుదురు ఈద్గాలో సందేశం ఇస్తున్న మత పెద్ద

మసీదుల్లో ముస్లింలు భక్తి శ్రద్ధలతో ప్రార్థనలు నిర్వహించారు. నున్న చెరువు సెంటర్లో మసీదులో హిమామ్ హజరత్ ప్రత్యేకంగా ప్రార్థనలు చేసి ప్రతి ఒక్కరూ త్యాగబుద్ధిని కలిగి ఉండాలన్నారు. వాగు సెంటర్లో మసీదులో ముస్లింలు ప్రత్యేకంగా ప్రార్థనలు నిర్వహించారు. పి.నైనవరం గ్రామం మసీదులో మత గురువు ఎండీ జాహేద్ ప్రత్యేకంగా ప్రార్థనలు నిర్వహించి, బక్రీద్ పండుగ విశిష్టతను వివరించారు. ఈ సందర్భంగా ఒకరినొకరు ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు.

త్యాగానికి ప్రతీక బక్రీద్

గన్నవరంరూరల్: త్యాగానికి ప్రతీక బక్రీద్ అని ముస్తాబాద జామియా మసీద్ ఇమాం ఇక్బాల్ భక్తులకు సందేశమిచ్చారు. స్థానిక ఈద్గాలో గురువారం బక్రీద్ ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ జీవిత కాలంలో ఒక్కసారైనా హజ్ యాత్ర చేయాలని చెప్పారు. జామియా మసీద్ కమిటీ భక్తుల ఏర్పాట్లు పర్యవేక్షించింది.

భక్తిప్రపత్తులతో బక్రీద్

కంకిపాడు: బక్రీద్ పర్వదినాన్ని ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మండలంలోని గోసాల, ఈడుపుగల్లు, కంకిపాడు, నెప్పల్లి, కోలవెన్ను పరిసర ప్రాంతాలకు చెందిన ముస్లింలు ఈద్గా మైదానాలకు వెళ్లి త్యాగానికి ప్రతీక అయిన బక్రీద్ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ప్రార్థనల అనంతరం ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. మత పెద్దలు, గురువులు బక్రీద్ ఆవశ్య



కొత్త మల్లవల్లి మసీదులో ప్రార్థనలు నిర్వహిస్తున్న ముస్లింలు

కతను తెలియజేశారు. ప్రార్థనల్లో ముస్లింలు అత్యధిక సంఖ్యలో పాల్గొన్నారు.

హనుమాన్ జంక్షన్‌లో..

హనుమాన్‌జంక్షన్ రూరల్: బక్రీద్ పర్వదినాన్ని ముస్లింలు గురువారం భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. బాపులపాడు మండలంలోని పలు మసీదుల్లో గురువారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. స్థానిక ఏలూరురోడ్డు, నెహ్రూ నగర్, మహాత్మగాంధీ నగర్, కొత్తపల్లి, కొత్త మల్లవల్లి, వేలేరు, శోభనాద్రిపురం గ్రామాల్లోని మసీదుల్లో అధిక సంఖ్యలో ముస్లింలు ప్రార్థనలకు హాజరయ్యారు. కొత్త మల్లవల్లి మసీదుకు గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీ మోహన్ రూ.25 లక్షల నిధులతో సీసీ రోడ్డును వేయించటంపై ముస్లింలు హర్షం వ్యక్తం చేశారు. 2024 ఎన్నికల్లో ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ తిరిగి ఘన విజయం సాధించాలని కొత్త మల్లవల్లి మసీదులో ముస్లింలు ప్రార్థనలు నిర్వహించారు.



ముస్తాబాద ఈద్గా వద్ద బక్రీద్ ప్రార్థనల్లో పాల్గొన్న భక్తులు



ఉయ్యూరు ఈద్గా మైదానంలో ప్రార్థనల్లో ముస్లిం పెద్దలు

తొలి ఏకాదశి పూజలు

పెనమలూరు: పెనమలూరు అంకమ్మ తల్లి దేవస్థానంలో గురువారం తొలి ఏకాదశి పూజలు ఘనంగా చేశారు. ఆషాఢ శుద్ధ ఏకాదశి సందర్భంగా సమాజంలో అందరు సుఖ శాంతులు, ఆయురారోగ్యాలతో ఉండాలని పురోహితుడు చిరంజీవి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తుడు కిలారు వెంకటశివాజీ దంపతుల ఆధ్వర్యంలో అమ్మవారికి భక్తులతో కలిసి కుంకుమ పూజలు చేశారు. మహిళా భక్తులు కుంకుమ పూజలో పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కు తీర్చుకున్నారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

చినకంచిలో..

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలో తొలిఏకాదశి సందర్భంగా గురువారం చినకంచి శ్రీవెంకటేశ్వరస్వామికి విశేష పూజలు చేశారు. పేలాల పిండి నైవేద్యంగా స్వామికి సమర్పించిన పిమ్మట భక్తులకు ప్రసాదంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వేద పారాయణం చేశారు. తూర్పు రామాయలంలో తొలి ఏకాదశి సందర్భంగా శ్రీకోదండ రామస్వామికి స్నపన పూజలు చేసి, తులసీ దళాలతో స్వామి వారికి ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. పడమర బజారులోని రామాలయంలో, బోడపాడు గ్రామంలో సీతారామంజనేయస్వామి ఆలయంలో తొలిఏకాదశి పూజలు జరిగాయి. విలేజి కండ్రిక లో శ్రీరామాలయం, పాతపాడులో శ్రీచెన్నకేశవస్వామి ఆలయం, అంబాపురం, వెంకటాపురం గ్రామాల్లో జరిగిన తొలిఏకాదశి పూజా కార్యక్రమాల్లో భక్తులు పాల్గొన్నారు.

పేలాల పిండి పంపిణీ..

తొలి ఏకాదశి పర్వదినం సందర్భంగా పెనమలూరు మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో గురువారం పేలాల పిండి పంపిణీ చేశారు. ఆర్యవైశ్య సంఘ మండల అధ్యక్షుడు రాచూరి ఆంజనేయులు ఆధ్వర్యంలో గ్రామంలో కోదండరామాలయం, సాయిబాబా మందిరాలు, శ్రీకనకదుర్గ అమ్మవారి ఆలయం, ఆంజనేయస్వామి ఆలయం, శ్రీసంతాన వేణుగోపాలస్వామివారి ఆలయం, ఇతర ఆలయాల్లో కూడా భక్తుల అవసరాలకు పేలాల పండి పంపిణీ చేశారు.

వైభవంగా శోభాయాత్ర..

ఉయ్యూరు: తొలి ఏకాదశి పర్వదినాన శ్రీ సాయిబాబా శోభాయాత్ర ఉయ్యూరు పట్టణంలో గురువారం వైభవంగా జరిగింది. పట్టణంలోని శ్రీ సాయి ధ్యానమందిరం కమిటీ ఆధ్వర్యంలో గురుపౌర్ణమి మహోత్సవాలను పురస్కరించుకొని విశేష పూజా కార్యక్రమాలు జరిపించారు. ఆలయం నుంచి స్వామి వారిని ప్రత్యేక వాహనంలో పట్టణ వీధుల్లో ఊరేగిస్తూ శోభాయాత్ర నిర్వహించారు. భక్తులు పాల్గొని సాయినామాన్ని ఆలపించారు.



ఆలయంలో కుంకుమ పూజలు చేస్తున్న మహిళా భక్తులు



గన్నవరం శివాలయంలో అమ్మవారికి శాకంబరీదేవి అలంకరణ

గన్నవరంలో..

గన్నవరం: తొలి ఏకాదశి సందర్భంగా గన్నవరం ప్రాంతంలోని పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక కోనాయి చెరువు సమీపంలోని శ్రీకాశీ విశాలాక్షి అన్నపూర్ణ సహిత విశ్వేశ్వరస్వామి దేవస్థానంలో అభిషేకాలు చేశారు. తొలుత అమ్మవారికి ఆలయ కమిటీ, గ్రామస్తులు ఆషాఢ సారె సమర్పించారు. అనంతరం శ్రీకాశీ విశాలాక్షి అన్నపూర్ణ అమ్మవార్లను శాకంబరీదేవిగా అలంకరించారు. ఆలయ ప్రాంగణాన్ని పలు రకాల కూరగాయలు, ఆకుకూరాలతో అలంకరించారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ జరిపారు. ఆలయ కమిటీ సభ్యులతో పాటు పలువురు పుర ప్రముఖులు పాల్గొన్నారు. దావాజిగూడెంలోని శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో తొలి ఏకాదశి సందర్భంగా పంచామృతాలతో స్నపన, తిరుమంజనం జరిపారు. అనంతరం భక్తులచే శ్రీవిష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణం, భగవద్గీత పారాయణం, భగవన్నామ సంకీర్తన చేశారు. ఆలయ అర్చకులు రామాచార్యులు, పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు.

నేత్రపర్వంగా పాండురంగడి కల్యాణం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పాతబస్తీలోని కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానం (కొత్త గుళ్ళు) ప్రాంగణంలో వేంచేసి ఉన్న రుక్మాబాయి సమేత పాండురంగస్వామి వారి శాంతి కల్యాణోత్సవం గురువారం నేత్రపర్వంగా జరిగింది. కల్యాణ మహోత్సవాల్లో భాగంగా గురువారం తెల్లవారుజాము నుంచి పలు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఉదయం స్వామి వారి మూలమూర్తులకు పంచామృత తిరుమంజనం కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. వివిధ ఫలపుష్పసుగంధ ద్రవ్యాలతో అభిషేకించారు. అలాగే ఆలయంలో కొలువై ఉన్న సంతాన వేణుగోపాలస్వామి వారికి కూడా తిరుమంజన కార్యక్రమాన్ని నిర్వహించారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కల్యాణ వేదికపై స్వామి వారి తిరు కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. తొలుత విష్వక్సేన పూజతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం మహాసంకల్పం, యజ్ఞోపవీతధారణ, మధుపర్కాల సమర్పణ, మాంగళ్యధారణ, తలంబ్రాలు సమర్పణ తదితర ఘట్టాలను ఆలయ అర్చకస్వాములు పులిపాక ఆంజనేయాచార్యులు, రాఘవాచార్యులు, అద్దేపల్లి మురళీకృష్ణచార్యులు



ప్రత్యేకాలంకరణలో స్వామి వారు

నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారి కల్యాణోత్సవ విశిష్టతను అర్చకస్వాములు భక్తులకు వివరించారు. పండరీపురంలో జరిగే రీతిన నగరంలో కూడా స్వామి వారి కల్యాణోత్సవం, అర్చనలను నిర్వహించడం అపూర్వమని చెప్పారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకులు, కమిటీ సభ్యులు ఉభయదాతలు తదితరులు పాల్గొన్నారు.

ప్రాచీన సంప్రదాయ జీవన విధానంతో సంపూర్ణ ఆరోగ్యం

గన్నవరం: మానవ జీవన విధానంలో వస్తున్న మార్పులు, ఆహార, ఆధ్యాత్మిక విధానంలో ఆచరణ లోపించడం వల్ల తీవ్ర అనారోగ్య పరిణామాలను ఎదుర్కొంటున్నారని ప్రముఖ ఆయుర్వేద వైద్యుడు డాక్టర్ రవివర్మ అన్నారు. స్థానిక విమానాశ్రయం పక్కనే ఉన్న ఏబీ కన్వెన్షన్ సెంటర్‌లో గురువారం న్యాయవాది కలపాల వెంకటరమణ ఆధ్వర్యంలో ఆరోగ్య అవగాహన సదస్సు నిర్వహించారు. తొలుత భక్తిశ్రద్ధలతో ధన్వంతరి హోమం నిర్వహించారు. అనంతరం రవివర్మ మాట్లాడుతూ నేటి ఆధునిక యుగంలో మానవులు మానసిక ఆనందాన్ని, ఆరోగ్యాన్ని కోల్పోయి జీవితాన్ని అగమ్యగోచరంగా చేసుకుంటున్నారని తెలిపారు. ఉరుకులు, పరుగుల జీవితంలో ఆరోగ్యంపై సరైన శ్రద్ధ వహించడం లేదన్నారు. ఫలితంగా క్యాన్సర్, బీపీ, షుగర్, థైరాయిడ్ వంటివి సాధారణ వ్యాధులుగా మారిపోయాయని తెలిపారు. ఒకప్పుడు 120 ఏళ్లు ఉన్న మనిషి జీవిత కాలం ప్రస్తుతం 60 ఏళ్లకు పడి



డాక్టర్ రవివర్మను సత్కరిస్తున్న రమణ

పోయిందన్నారు. ఈ పరిస్థితిలో మార్పు రావాలంటే జీవన, ఆహార శైలిని పాటించాలని సూచించారు. అనంతరం సుమారు 1,500 మందికి ఉచితంగా ఆయుర్వేద మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ పొట్లూరి బసవరావు, ఉప సర్పంచ్ పాలడుగు నాని, పుర ప్రముఖులు నెక్కలపూడి ఈశ్వరరావు, గన్నె వెంకట్రావు, అరవపల్లి రణధీర్, ప్రత్తిపాటి శ్రీనివాసరావు, ప్రసాద్, నిడమర్తి బుజ్జరావు, నల్లమోతు రమేష్, ఆర్.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

ఉంగుటూరు: చెన్నై-కోల్‌కత జాతీయ రహదారిపై తేలప్రోలు ఉషారామ కళాశాల సమీపంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులకు స్వల్పగాయాలయ్యాయి. ప్రమాదంలో కారు ధ్వంసమైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం తెలంగాణ రాష్ట్రం కరీంనగర్‌కు చెందిన కోట సతీష్, శ్రీనివాసరావు పెద అవుటపల్లిలోని తమ స్నేహితుడైన నానిబాబు వద్దకు వచ్చారు. కారులో వారు ముగ్గురు కలసి గురువారం చిన్న తిరుపతికి బయలుదేరి వెళుతున్నారు. తేలప్రోలు ఉషారామ ఇంజినీరింగ్ కళాశాల సమీపంలో కోల్‌కత వెళుతున్న లారీ వారి కారు వెనుక భాగంలో బలంగా ఢీకొంది. ఈ ఘటనలో కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొనడంతో కారులో ప్రయాణిస్తున్న వారికి స్వల్పగాయాలయ్యాయి. క్షతగాత్రులను సమీపంలోని పిన్నమనేని ఆసుపత్రికి తరలించారు.

పేరంటాలమ్మ ఆలయ చైర్మన్‌గా బోయిన భాను

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడులోని శ్రీ వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయ చైర్మన్‌గా బోయిన భాను ప్రదీప్ వరుసగా రెండవసారి ఎంపికయ్యారు. దేవదాయశాఖ ఉన్నతాధికారులు గురువారం చైర్మన్‌తో పాటు 8 మందితో కూడిన ధర్మకర్తల మండలి సభ్యుల పేర్లను ప్రకటించారు. ధర్మకర్తల మండలి సభ్యులుగా మత్తె కిరణ్ కుమార్, దొండపాటి అచ్చుతరావు, అంగిరేకుల సునీత, శిఖాకొల్లి యల్లమందయ్య, మాచెర్ల అరుణకుమారి, వేమినేని రజిత, ఉప్పు శివలీల, కాకాని ప్రశాంతి పేర్లను అధికారికంగా ప్రకటించారు. ఈ ఏడాది ఫిబ్రవరి 26న గత పాలక మండలి పదవీకాలం ముగిసింది. దీంతో గత నెలలో ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ పర్యవేక్షణలో ఏర్పాటైన కమిటీ సభ్యుల పేర్ల జాబితాను దేవదాయశాఖ ఉన్నతాధికారులకు పంపించడంతో ఆలయ నూతన కమిటీని



ఖరారు చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ బోయిన భాను ప్రదీప్ మాట్లాడుతూ ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్, ముఖ్యమంత్రి కార్యక్రమాల కన్వీనర్ తలశిల రఘురాం, గొల్లపూడి మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ కొమ్మా కోట్లు తనపై నమ్మకంతో వరుసగా రెండవసారి ఆలయ చైర్మన్ బాధ్యతలు అప్పగించినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు. గత రెండు సంవత్సరాలు ఆలయ చైర్మన్‌గా తన బాధ్యతలు సక్రమంగా నిర్వహించగలిగానని ఈసారి కూడా ఆలయ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు. వచ్చే వారంలో ప్రమాణస్వీకారం చేసి పదవీ బాధ్యతలు స్వీకరించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన ఆలయ పాలకవర్గ మండలికి ఏఎంసీ మాజీ చైర్మన్ కొమ్మా కోటేశ్వరరావు, ఎంపీపీ చెన్ను ప్రసన్నకుమారి తదితరులు శుభాకాంక్షలు తెలియజేశారు.

జేసీఎస్ మండల ఇన్‌చార్జ్‌ల నియామకం

గన్నవరం: నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు వైఎస్సార్ సీపీ జేసీఎస్ ఇన్‌చార్జ్‌లను నియమిస్తూ గురువారం పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులను జారీచేసింది. బాపులపాడు మండలానికి అవిర్నేని శేషగిరిరావు, గన్నవరానికి కైలే శివకుమార్, ఉంగుటూరుకు వింత ఆదినారాయణరెడ్డి(నాని), విజయవాడ రూరల్ మండలానికి సాదం వెంకటేశ్వరరావులను ఇన్‌చార్జ్‌లుగా నియమించారు.

పెనమలూరు నియోజవర్గంలో..

కంకిపాడు: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో జేసీఎస్ (జగనన్న సచివాలయం) మండల ఇన్‌చార్జిలను పార్టీ కేంద్ర కార్యాలయం ప్రకటించింది. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేసింది. పెనమలూరు నియోజకవర్గానికి సంబంధించి కంకిపాడు మండలానికి రాచూరి చిరంజీవి, పెనమలూరు మండలానికి వల్లె వెంకట నరసింహారావు, ఉయ్యూరు మండలానికి యార్లగడ్డ సాయి, ఉయ్యూరు నగర పంచాయతీకి వణుకూరు సురేష్‌బాబు, వెంట్రప్రగడ శివనాగప్రసాద్, వైఎస్సార్ తాడిగడప మునిసిపాలిటీకి క్లస్టర్ 1కు వేమూరి బాలకృష్ణ, ఎండీ చాన్‌బాషా, క్లస్టర్ 2కి యార్లగడ్డ నాగబాబు, ఎండీ జిన్నాలను నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం ప్రకటించింది.

లో ఓల్టేజీ సమస్యకు పరిష్కారం

ఉయ్యూరు: పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌తో లో ఓల్టేజీ సమస్యకు పరిష్కారం లభించిందని విద్యుత్ శాఖ ఈఈ (ట్రాన్స్‌ఫార్మర్స్) రవికిశోర్ తెలిపారు. పట్టణంలోని ఉయ్యూరు సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ వినియోగం పెరగటంలో కొద్ది రోజులుగా లో ఓల్టేజీ సమస్య తలెత్తుతోంది. సమస్య పరిష్కారానికి విద్యుత్ శాఖ అధికారులు అత్యధిక లోడు సామర్థ్యం కలిగిన పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌లను ఏర్పాటుకు చర్యలు చేపట్టారు. రూ 1.10 కోట్ల అంచనా వ్యయంతో నూతన ట్రాన్స్‌ఫార్మర్‌లను గురువారం అమర్చి అందుబాటులోకి తెచ్చారు. ఈ పనులను విద్యుత్ శాఖ ఈఈ రవికిశోర్ పర్యవేక్షించారు. పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుతో లో ఓల్టేజీ సమస్య పరిష్కారమవుతుందన్నారు. వినియోగదారులకు మెరుగైన విద్యుత్ సరఫరానే ప్రభుత్వ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో ఉయ్యూరు ఈఈ కృష్ణనాయక్, డీఈ రామకృష్ణ, ఏఈ నాగమల్లేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

హక్కులపై మహిళలకు అవగాహన

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): ఆజాదీ కా అమృత్ మహోత్సవం కార్యక్రమంలో భాగంగా 'నిర్భయ్ భారత్- స్వశక్తి నారీ' అనే అంశంపై విజయవాడ రైల్వే హాస్పటల్ న్యూ ఓపీడీ భవనంలో గురువారం సెమినార్ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా రైల్వే హాస్పటల్ సీఎమ్ఎస్ డాక్టర్ ఎం.సౌరిబాల పాల్గొని మహిళ ఆరోగ్యం, పోషకాహారం, విద్య, బాలల హక్కులు, మహిళా హక్కులు, సాధికారిత అనే అంశాలపై మాట్లాడారు. మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే వారి కుటుంబతో పాటు సమాజం కూడా ఆరోగ్యంగా ఉంటుందన్నారు. దైనందిన జీవితంలో మహిళలు రోజు తీసుకునే ఆహారంతో పాటు అదనంగా పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏసీఎంఎస్ డాక్టర్ ఎం.జైదీప్, డాక్టర్ సీతారాం, సిబ్బంది పాల్గొన్నారు.

కొత్త మలుపు తిరిగిన కేసరపల్లి స్థల వివాదం

గన్నవరం: మండలంలోని కేసరపల్లిలో స్థల వివాదం కొత్త మలుపు తిరిగింది. కుటుంబ ఆర్థిక అవసరాల నిమిత్తం విక్రయించిన స్థలాన్ని కాజేసేందుకు తన పెద్ద కుమార్తె పల్లపోతు దుర్గాకళ్యాణి, గంగరాజు దంపతులు తప్పుడు దస్తావేజులు సృష్టించడమే కాకుండా అసత్య ఆరోపణలు చేస్తున్నారని దుర్గాకళ్యాణి తండ్రి కొలుసు వీరవెంకటేశ్వరరావు ఆరోపించారు. కుమార్తె, అల్లుడు వైఖరికి నిరసనగా గురువారం బంధువులతో కలిసి ఆయన ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వీర వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గ్రామంలోని 94 గజాల స్థలంతో పాటు రేకుల షెడ్డును తన రెండవ కుమార్తె వివాహ అవసరాల నిమిత్తం మాజీ ఎంపీపీ పొట్లూరి బసవరావుకు విక్రయించినట్లు చెప్పారు. సదరు స్థలాన్ని తనకు తెలియకుండానే పెద్ద కుమార్తె దుర్గాకళ్యాణి, అల్లుడు గంగరాజు దొంగ దస్తావేజులు సృష్టించి ఆక్రమించేందుకు ప్రయత్నించారని తెలిపారు. తన అల్లుడు గంగరాజు నుంచి తనకు ప్రాణహాని ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. వీర వెంకటేశ్వరరావు చిన్న కుమార్తెలు నిర్మల, జ్యోత్స్న మాట్లాడుతూ తమ అక్క, బావ గతంలో తమ తల్లి పేరున ఉన్న ఆస్తులను కూడా స్వాహా చేశారని తెలిపారు. తప్పుడు దస్తావేజులు సృష్టించిన గంగారాజు, దుర్గాకళ్యాణిపై న్యాయపరంగా పోరాడుతామని స్పష్టం చేశారు.



ఆందోళన చేస్తున్న వీరవెంకటేశ్వరరావు, బంధువులు